## క్లుప్తంగా

### క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు కృషి



సదస్సులో మాట్లాడుతున్న విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి పేర్కొన్నారు. జేఎన్‌టీయకేలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ ఎకో సిస్టమ్ టెక్నాలజీ ఇండియా, నేషనల్ క్వాంటమ్ మిషన్ సంయుక్తంగా క్వాంటమ్ సైన్స్ టెక్నాలజీ అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మధుమూర్తి మాట్లాడుతూ అనంతపురం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించారని తెలిపారు. క్యూఈటీసీఈ సీఈఓ రీనా దయాల్, వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ కూడా ప్రసంగించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ జేబీవీ రెడ్డి, సుందర్ బాలకృష్ణ, శంతన్‌శర్మ, సంతోష్‌కుమార్‌లు క్వాంటమ్‌సైన్స్ టెక్నాలజీపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ వీసీ ప్రసాదరాజు, కే.పద్మరాజు, శ్రీనివాస్‌కుమార్ సీఎస్ఈ ప్రొఫెసర్ సుమలత, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

### నేడు లయన్స్‌క్లబ్ కాకినాడ సేవా మహోత్సవం



డాక్టర్ బాదం బాలకృష్ణ

**బాలాజీచెరువు:** లయన్స్ ఇంటర్నేషనల్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్ కాకినాడ సేవా మహోత్సవం ఆదివారం స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు వనమాడి వేంకటేశ్వరరావు, పంతం నానాజీ, లయన్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వి.విజయ్‌కుమార్‌రాజు, జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్, వేలురు సూర్యనారాయలు హాజరై దాదాపు రూ.8లక్షల విలువ చేసే కుట్టు మెషీన్లు, వెట్ గ్రైండర్లు, సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, ఏసీలు, లాండ్రీ కార్ట్‌లు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ముందుగా గ్రీన్‌ఫీల్డ్ పాఠశాల వారితో శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవ నృసింహ విజయ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

### నేత్రదానం



వెంకట్రావు(ఫైల్)


**కరప:** పెనుగుదురు గ్రామానికి చెందిన పులపకూర వెంకట్రావు(64) శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మరణించారు. అతని భార్య లక్ష్మి, మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పులపకూర శుభామహేష్(కుమారుడు), ఇతర కుటుంబ సభ్యులు వెంకట్రావు రెండు నేత్రాలను రెడ్‌క్రాస్ ఐ బ్యాంక్‌కు దానమిచ్చారు. విషాదంలో కూడా బాధిత కుటుంబ సభ్యులు మానవత్వంతో ముందుకు వచ్చి మృతుని నేత్రాలు దానమివ్వడం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపారని పరామర్శించిన పలువురు గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి నారాయణ రావు తదితరులు వెంకట్రావు భౌతికకాయానికి నివాళులర్పించి, సంతాపం తెలిపారు.

### హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

**కాకినాడ రూరల్:** కాకినాడలోని ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ సెంటర్‌లో నివాసం ఉంటున్న కుక్కల నానిపై హత్యాయత్నానికి పాల్పడిన అదే ప్రాంతానికి చెందిన పెంటి కృష్ణ ప్రసాద్(జాజి)ను శనివారం అరెస్టు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు తెలిపారు. ఇంటి సరిహద్దు విషయమై ఇరు కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో ఇంట్లో పడుకున్న నానిపై శుక్రవారం చాకుతో దాడి చేసి చంపేందుకు రెండు చోట్ల పొడిచి పారిపోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరారీలో ఉన్న నిందితుడిని ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పచడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

### 30 నుంచి వేసవి క్రీడా శిక్షణ

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** జిల్లా క్రీడాభివృద్ధి మండలి, అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి మే 31 వరకు ఉచిత వేసవి క్రీడాశిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో 8 నుంచి 16 సంవత్సరాల బాల బాలికలకు రెసిడెన్షియల్ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటల లోపు తమ పేర్లు 93813 68116 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు.



పెదకొత్తూరు, వాకాడ గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు



వాకాడ, పెదకొత్తూరు గ్రామాల మధ్య పెరిగిన చెట్లు



గొర్రిపూడి, పాతర్లగడ్డ గ్రామాల మధ్య చెట్ల నీడలో వెళుతున్న ప్రయాణికులు

# చల్ల చల్లగా..

- ఆ రహదారుల్లో ప్రయాణం ఆహ్లాదకరం
- పాదచారులకు ఆశ్రయమిస్తున్న పచ్చని చెట్లు

**కరప:** ఎండలు మండుతున్నాయి. ఎండలకు భయపడి అంతా ఇంటికే పరిమితమవుతున్నారు. అయితే కొన్ని పనుల కారణంగా బయటకు వెళ్లక తప్పడంలేదు. ఇంత ఎండలో ఎక్కడైనా చెట్లు కనిపిస్తే చాలు అక్కడే ఆగి సేదతీరుతాం. ఇలాంటి ఎండలో రోడ్డుకిరువైపులా చెట్లు ఉంటే ఎంతో హాయిగా ఉంటుంది. అలాంటి రోడ్లు ఉన్నాయి. కరప మండలంలో కాకినాడ నుంచి కోటిపల్లి, రావులపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రోడ్డు ఇరువైపులా చెట్లు ఉండడంతో కాకినాడ-రావులపాలెం ప్రధానరహదారిలో మండలంలోని వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు మీదుగా వెళ్లే రోడ్డుకిరువైపుల ఉన్న పచ్చని చెట్లు పాదచారులకు, వాహనచోదకులకు ఆశ్రయిస్తున్నాయి. అలాగే కాకినాడ-కోటిపల్లి వెళ్లే రహదారిలో పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు మీదుగా వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు పాదచారులకు, వాహనచోదకులకు మనసుకు హాయిని కల్గిస్తున్నాయి.

**హాయిగా ప్రయాణం**

వేసవిలో భానుడు భగభగలతో ఎండలు చుర్రుమంటున్నాయి. దీంతో ప్రయాణికులు, పాదచారులు, వాహనచోదకులు అపసోపాలు పడుతున్నారు. కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారిలో వేములవాడ నుంచి వాకాడ, పెదకొత్తూరు వరకు, కరప-పెనుగుదురు గ్రామాలమధ్య, పెనుగుదురు, గొర్రిపూడి, కొంగోడు తదితర గ్రామాల మధ్య రోడ్డు కిరువైపుల ఉండే చెట్లు నీడనిస్తున్నాయి. ఈ రహదారిలో ప్రయాణించేవారు కొంతసేపు చెట్ల నీడన ఆగి వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఈ రోడ్డున వెళ్లేవారు చెట్లనీడన ఆగి సేదతీరి వెళ్లడం పరిపాటిగా మారింది. అశోక చక్రవర్తి రోడ్డుకిరువైపుల చెట్లునాటి, బావుల తవ్వించినట్టు చరిత్ర చెపుతుంటే, ఈ రహదారిలో వాటివల్ల ప్రయోజనం ఏమిటో ప్రత్యక్షంగా కనబడుతోందని వాహనచోదకులు, పాదచారులు అంటున్నారు.



వేములవాడ-వాకాడ గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

### మే డేను విజయవంతం చేయండి

**కాకినాడ సిటీ:** మే డేను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ సంఘం గౌరవాధ్యక్షురాలు జి.బేబీరాణి కోరారు. శనివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి అధ్యక్షతన జరిగిన అంగన్‌వాడీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండా పని భారం పెంచి, యాప్‌లు తెచ్చి అనేక రకాలుగా మారుస్తూ అంగన్‌వాడీలను ప్రభుత్వం మానసిక ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. కాకినాడ రూరల్, జగ్గంపేట, శంఖవరం ప్రాజెక్టులలో అంగన్‌వాడీలు చనిపోతే కనీసం మట్టి ఖర్చులు ఇవ్వలేదన్నారు. కూరగాయలు, గ్యాస్ అన్నింటి ధరలు పెంచుతోందన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మే 20న దేశ వ్యాప్త సమ్మె చేపడతామన్నారు. ఈ సందర్భంగా కర్మిక దినోత్సవం మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బేబీరాణి పిలుపునిచ్చారు. దీనిలో అన్ని రంగాల కార్మికులను కలుపుకొని మే డే విజయవంతం చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ జిల్లా నాయకురాళ్లు ఎరుబండి చంద్రావతి, ఎం రమణమ్మ, ధనలక్ష్మి, దాడి బేబీ, వడ్డి ఎస్తేరురాణి, ఎంకే జ్యోతి, వీరవేణి, వీరవేణి, పద్మ, కృష్ణవేణి, హేమలత, సత్య, తులసి తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డపై వివక్షను పూర్తిగా రూపుమాపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ మీనా

**కాకినాడ సిటీ:** ఆడశిశు జననాలపై వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు పీసీపీఎన్‌టీడీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కోర్టు హాలులో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపటిసారిలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను కమిటీ ఆమోదం జారీ చేసింది. జిల్లాలో అల్ట్రా సౌండ్ స్కానర్లను పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా ఉండేలా స్కానింగ్ సెంటర్లలో నిర్వహించిన రహస్య డెకాయ్ ఆపరేషన్లపై ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ మీనా సమీక్షించి వాటికి చేసిన ఖర్చును ఆమోదించారు. డెకాయి ఆపరేషన్లు నిరంతరం కొనసాగించాలని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీసీపీఎన్టీటీ చట్టంలో నిర్దేశించిన నిబంధనలు అన్ని స్కానింగ్ సెంటర్లలో తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రమేష్, డాక్టర్ సరిత, డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఏపీపీ డి.నాగబాబు, పోలీస్ అధికారి పి.రామచంద్రరావు, డెమో రాజు, ఎన్‌జీవో ప్రతినిధులు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టంపై మిశ్రమ స్పందన



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నేతలు

**బోట్‌క్లబ్ :** వక్ఫ్ సవరణ బిల్లు-2025 సవరణ చట్టంపై స్థానిక గాంధీ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. గాంధీ భవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ సమన్వయ కర్తగా నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు వక్ఫ్ చట్టంపై మిశ్రమ స్పందనలను వ్యక్తం చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి ఎనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ రామ జన్మభూమిలో రాముని గుడి నిర్మాణానికి రుజువులు చూపించమని అడ్డంకులు సృష్టించిన నేతలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పేరిట వాటికి ఉన్న కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను కంప్యూటరీకరించడానికి కేంద్రం చట్టం తీసుకుని వస్తే తీవ్రంగా వ్యతిరేకించడం అప్రజాస్వామ్యమన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ సయీద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులకు దాతలు ఇచ్చిన కోట్లాది రూపాయల ఆస్తులకు లెక్కా పత్రం లేకుండా పోవడంతో వాటి నిర్వహణ అవినీతి మయంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు, దర్గాలను నిర్వహించే మతావలి వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకురావడాన్ని హర్షించదగిన విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.శివ గణేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వక్ఫ్ చట్టం ఏవిధంగా అమలు చేస్తున్నారో, అదే విధంగా హిందూ ధార్మిక చట్టాన్ని కూడా దేశ వ్యాప్తంగా ఒకే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం సవరణలో భాగంగా అన్య మతస్తులను చేర్చడం దారుణమైన విషయమన్నారు. న్యాయవాది విశ్వనాథ శ్రీనివాసరాజు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల సంరక్షణతో పాటుగా పేద ముస్లింలకు మేలు చేకూరేలా చేసిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని అంగీకరించక తప్పదన్నారు. ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి జవహర్ మాట్లాడుతూ వక్ఫ్ బై యూజర్ నిబంధన ముస్లిం ఆస్తులను చిన్నాభిన్నం చేయడానికి ఉద్దేశించినదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ భవన్ ప్రధాన కార్యదర్శి వైఎస్‌వీఎస్ మూర్తి, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవీఆర్ ఫణీంద్ర, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, డాక్టర్ పాలెపు రవి పాల్గొన్నారు.

## పేదల ఇళ్లు కూల్చివేతపై చర్యలు చేపట్టాలి



బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న ప్రముఖులు

**కాకినాడ సిటీ:** కాకినాడ జిల్లా పెదపూడి మండలం దోమాడ చెరువుగట్టు ఎదురుగా పేదల ఇళ్లను కూలిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల మహానాడు, ప్రజాసంఘాల నాయకులు నిర్వాసితులతో కలిసి శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ భూమిలో తొమ్మిది ఇళ్లకు చెందిన కుటుంబాలు 60 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, ఇప్పుడు అర్ధాంతరంగా తొలగించడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో ఆ మర్మాన్ని బహిర్గతం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. దోమాడ గ్రామంలో గత 60 ఏళ్లుగా అన్ని హక్కులతో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారిపై ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కోసం తహసీల్దార్, ఆర్అండ్‌బీ జేఈ, దోమాడ గ్రామ కార్యదర్శి, పోలీసులు కలిసి బలవంతంగా ఖాళీ చేయించారని ఆందోళనకారులు వివరించారు. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కోసం ప్రభుత్వ వ్యవస్థ అంతా కలిసి ఈనెల 23వ తేదీ తెల్లవారు జామున వారిని బలవంతంగా ఖాళీ చేయించడం దారుణమన్నారు. తక్షణమే అధికారులపై కేసు నమోదు చేయాలని, ఈ ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎస్సీ గృహాలను కూల్చివేసిన రియల్ ఎస్టేట్ గోల్డెన్ సిటీ వ్యాపారి గోవిందరాజులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో బాధితులతో పాటు మాల మహానాడు, ప్రజాసంఘాల నాయకులు జి.ఆదినారాయణ, సిద్ధాంతుల కొండబాబు, టి.చంగల్‌రావు, ఏనుగుపల్లి కృష్ణ, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసూతి మరణాలు నివారించాలి

వైద్యాధికారులతో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

**కాకినాడ సిటీ:** హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, దీని ద్వారా ప్రసూతి మరణాలను నివారించాలని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రసవ సమయంలో మాతా, శిశు మరణాల నివారణ కార్యాచరణపై ఇన్‌చా కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో గడచిన 3, 4 త్రైమాసాల్లో జిల్లాలో జరిగిన మాతా శిశు మరణాలు అందుకు దారితీసిన పరిస్థితులపై ఆయన సమీక్షించారు. గడచిన 6 నెలల జిల్లాలో సంభవించిన తొమ్మిది మాతృ మరణాలపై కేసుల వారీ విశ్లేషించి, అటువంటి అవాంఛనీయ మరణాలు పునరావృత్తం కాకుండా చేపట్టాల్సిన చర్యలు ఆయన సూచించారు. రక్తహీనత, పోషణలోపం, చిన్న వయస్సులోనే గర్భధారణ వంటివి నివారించాలని అధికారులను ఆదేశించారు. హైరిస్క్ గర్భధారణలను గుర్తించిన నాటి నుంచి సురక్షితంగా ప్రసవించే వరకూ అవసరమైన అన్ని జాగ్రత్తలు నిశితంగా పాటించాలన్నారు. ప్రసవ సమయంలో మరణించిన మహిళల బంధువులతో మాట్లాడి జరిగిన నష్టానికి ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ మీనా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి హెచ్.నరసింహనాయక్, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, డీఐవో డాక్టర్ సుబ్బరాజు, జీజీహెచ్ వైద్యులు జయధీర్, పద్మజ, ఎంఎస్‌వో జాన్‌జూడే జాషువా, వి.అరవింద్‌కుమార్, ఉషశ్రీ, సౌజన్య, డీపీహెచ్ఎన్ఏవో, ప్రయివేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, ప్రోగ్రామ్ అధికారులు, హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు బిరుదా సూర్యనారాయణ

- పెద్దాపురప్పాడు హైస్కూలు డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట




వేడుకల్లో ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే, ఇతర నాయకులను సత్కరిస్తున్న స్థల దాత కుటుంబ సభ్యులు

**కరప:** ఎందరికో విద్యనందిస్తున్న పెద్దాపురప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఏడెకరాలు స్థలమిచ్చిన మాజీ ఎమ్మెల్యే, తాళ్లరేవు సమితి మాజీ అధ్యక్షుడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. పెద్దాపురప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటుచేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం శనివారం ఏర్పాటు చేసిన డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్దాపురప్పాడు, పరిసర 14 గ్రామాలవారు విద్యనభ్యసించి, ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ఉపాధ్యాయలుగా, ఉన్నతాధికారులుగా, వ్యాపారవేత్తలుగా, రాజకీయనాకులుగా, కళాకారులుగా ఉన్నతస్థానాలు అధిరోహించారంటే కీస్తుశేషులు బిరుదా సూర్యనారాయణ వల్లనేనని ఆయన పేర్కొన్నారు. ఏడున్నర దశాబ్దాల క్రితమే ఎంతో విలువైన స్థలాన్ని ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చారంటే బిరుదా సూర్యనారాయణ దాతృత్వాన్ని ఎమ్మెల్సీ తోట కొనియాడారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ పాఠశాల స్థలదాత ఫకీర్రావు సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హైస్కూలు స్థలదాత ఆశయానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే నానాజీ, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులను బిరుదా సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా సూర్యనారాయణ(చంటిబాబు) ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ముందుగా నాయకులు, అధికారులు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్సీ తోట హైస్కూలు ఆవరణలోని స్థలదాత బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు స్థల దాత బిరుదా సూర్యనారాయణ ఇంటి వద్ద రిటైర్డు లేబర్ ఆఫీసర్, పూర్వ విద్యార్థి నల్లా వెంకన్న వాహన ర్యాలీని ప్రారంభించగా పెద్దాపురప్పాడు హైస్కూలు వరకు ర్యాలీగా వచ్చారు. హెచ్ఎం ఎస్ఎస్ఎస్ఎం శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, హైస్కూలు మొదటి బ్యాచ్ విద్యార్థి (1950) కాకర్లపూడి సుబ్బరాజు వజ్రోత్సవ వేడుకల పతాకాన్ని ఎగురవేశారు. సాయంత్రం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొండా సూర్యనారాయణ(చంటిబాబు) అధ్యక్షతన పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం, మోదో సదస్సు నిర్వహించారు. స్థల దాత కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థి ఐరెడ్డి సత్యనారాయణ వందనసమర్పణ చేశారు. గ్రామసర్పంచ్ బిరుదా సరస్వతి, ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యాళ్ల నాగమణి నాయకులు, గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### వైద్య ఖర్చులకు విద్యార్థుల సాయం



విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.50 వేలు అందిస్తున్న కరస్పాండెంట్ నరసింహమూర్తి

**కాకినాడ రూరల్:** తమతో పాటు చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుసుకున్న తోటి విద్యార్థులు దాతృత్వంతో అండగా నిలిచారు. రమణయ్యపేట గ్రామం గైగోలుపాడులో మూర్తి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నురుకుర్తి జీవన్, రాజామణి, క్రిషకిల్లా, మార్టిన్‌లు విద్యను అభ్యసిస్తున్నారు. వీరి తల్లిదండ్రులు రమేష్ దివ్యాంగుడు, తల్లి మార్తమ్మ ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. పిల్లల చదువుకు స్కూల్ కరస్పాండెంట్ పాలిక నరసింహమూర్తి తోడ్పాటు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవన్, రాజామణి, క్రిషకిల్లా, మార్టిన్ తల్లిదండ్రులు రమేష్, మార్తమ్మల ఆరోగ్య సమస్యలు గురించి తెలుసుకున్న తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.20వేలు సేకరించడంతో వాటిని అదనంగా మరో రూ.30వేలు కరస్పాండెంట్ నరసింహమూర్తి అందజేయడంతో మొత్తం రూ.50వేలు, నిత్యావసర సరకులు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోడ్పాటును నరసింహమూర్తి అభినందించారు. సహకారం అందించంలోనే కాదు చదువులోనూ తమ విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణులని, పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



పాతర్లగడ్డలో రైతులు పద్దరాజు, లక్ష్మణరావులను సత్కరిస్తున్న సర్పంచ్, ఏడీఏ

**కరప:** ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. మండలం పాతర్లగడ్డలో శనివారం గ్రామసర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది సంయుక్తంగా ప్రచారం చేసి, ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను చైతన్యపరచాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, కిచెన్ గార్డెన్, కేఏపీ యాక్షన్‌ప్లాన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా పీఎండీఎస్ కిట్లను ఏడీఏ రైతులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులు చింతా పద్దరాజు, బండారు లక్ష్మణరావులను సర్పంచ్ ఏసుబాబు, గ్రామస్తులతో కలిసి ఏడీఏ బాబూరావు సత్కరించారు. యూనిట్ ఇన్‌చార్జి ఎల్.విజయలక్ష్మి, ఏటీఎం సూర్య, వీఏఏ లాస్య, ఐసీఆర్పీలు ఎస్.దుర్గ, ఎస్.మంగాదేవి, డీఎంఎంటీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ నిర్వహణకు ముహూర్తం ఖరారు

- అర్బన్, రూరల్‌లో 50 శిబిరాలు
- 10 క్రీడాంశాల్లో రెసిడెన్షియల్ శిబిరాలు
- డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** జిల్లా క్రీడాభివృద్ధి మండలి ఆధ్వర్యంలో శాప్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) సహకారంతో ఈ ఏడాది నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ముహూర్తం ఖరారైంది. శనివారం కాకినాడ జిల్లా క్రీడామైదానం కార్యాలయంలో డీఎస్ఏ కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులతో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 14 ఏళ్ల బాల బాలికలకు 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు, కాకినాడ డీఎస్ఏతోపాటు, ఇతర ప్రాంతాల్లో 10 క్రీడాంశాల్లో రెసిడెన్షియల్ క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇవి మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతి శిబిరానికి రూ. 5వేల మెటీరియల్, 1500 శిక్షకుని రెమ్యూనిరేషన్, 500 ఇతర ఖర్చులకు నిధులు మంజూరయ్యాయన్నారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన క్రీడా సామగ్రి డీఎస్ఏ తరుపున అందిస్తామని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ క్యాంపులకు రోజుకు రూ.150 క్రీడాకారుడు ఒక్కొక్కడికి ఇస్తామని తెలిపారు. ఒలింపిక్ సంఘం నుంచి జి.ఎలీషాబాబు, డీఎస్ఏ నుంచి బాస్కెట్‌బాల్ కోచ్‌రుద్ర, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నుంచి వి.రవిరాజు కమిటీగా ఏర్పడి క్యాంపుల స్క్రూటినీని నిర్వహించారు. గుర్తింపు ఉన్న అసోసియేషన్లకు మాత్రమే వేసవి శిక్షణ కేటాయించాలని పలువురు అసోసియేషన్ సభ్యులు డీఎస్‌డీఓకు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్ఏ కోచ్‌లు, వివిధ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులది వికృతమైన చర్య



ఇంద్రపాలెంలో మృతులకు నివాళులు అర్పిస్తున్న అన్ని మతాలు వారు

**బోట్‌క్లబ్:** పహల్గాం ఉగ్రదాడికి వికృతమైన చర్యని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ అన్నారు. పరిషత్ ఆధ్వర్యంలో శనివారం కశ్మీర్‌లోని పహల్గాంలో హిందూ పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. స్థానిక భానుగుడి సెంటర్ నుంచి కోకిలా సెంటర్ వరకూ ఈ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని ప్లకార్డులు ప్రదర్శించి ఈ ర్యాలీ నిర్వహించారు.రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ఉగ్రవాదం ప్రోత్సహించే వాళ్లని తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. మతోన్మాదం ఎక్కువై కొంత మంది ముస్లింలు ఉగ్రవాదులగా మారి మారణకాండ సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పరషత్ సభ్యులు బిక్కిన రాజు, గుండోజు భానోజీరావు, గోపరాజు పాల్గొన్నారు.

**ఉగ్రదాడిలో మృతులకు సంతాపం**

**కాకినాడ రూరల్:** పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు ఇంద్రపాలెం గ్రామంలో అల్లూరి సెంటరులో జెడ్ బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి ఘన నివాళులర్పించారు. ఇంద్రపాలెం, చీడిగ గ్రామాలలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, బౌద్ధులు, మార్క్సిస్టులు, అంబేడ్కర్‌వాదులు, పెన్షనర్స్, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు అన్ని వర్గాల వారు మత సామరస్యం చాటేలా మానవ హారం, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదులు చర్యను ఖండించారు. మృతులకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు. రెండు నిముషాలు పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో హరినాథ్, పార్థసారధి, ఆల్తాఫ్, భాష, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోని, శ్రీనివాస్, రాయ్‌కుమారి, కార్మిక సంఘాల నాయకులు రామకృష్ణ, రాజా, విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, ఉద్యోగ సంఘాల నాయకులు శశికుమార్, రవకుమార్, మన ఊరు - మన బాధ్యత బాధ్యులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**ఉగ్రదాడిలో మృతులకు నివాళి**

**కాకినాడ సిటీ:** కాశ్మీర్‌లో పెహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించాలన్నారు. బాధితక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.బేబీరాణి, పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, సి.వెంకట్రావు, కె.అప్పారావు, హుస్సేన్, విజయకుమారి, షంషుద్దీన్; అమృత, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.